# సాక్షి నల్లగొండ

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024






**కరువుకు బీఆర్ఎస్సే కారణం**
కరువు పరిస్థితులకు బీఆర్ఎస్ పాలనే కారణమని టీజేఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. - 8లో



**ముగ్గురి అరెస్టు**
గంజాయి రవాణా చేస్తున్న ముఠాను శనివారం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. - 8లో

గరిష్టం / కనిష్టం
42° / 27°

**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### పౌరుడి చేతిలో బ్రహ్మాస్త్రం 'సీ-విజిల్'

- ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన అక్రమాలపై సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ చందనా దీప్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌరుడి చేతిలో బ్రహ్మాస్త్రం సీ-విజిల్ యాప్ అని, ఇందులో ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, నగదు, వస్తువులు, మద్యం పంపిణీ తదితర అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సీ-విజిల్ యాప్ ద్వారా పంపితే వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

### టీఎన్‌జీఓ వెటర్నిటీ అసోసియేషన్ ఎన్నిక


అజీముద్దీన్


జానిపాష

నల్లగొండ టౌన్ : టీఎన్‌జీఓ వెటర్నిటీ అసోసియేషన్ ఎన్నికను శనివారం నల్లగొండలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.మురళి, బింగి సురేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో జిల్లా టీఎన్‌జీఓ వీఏ అధ్యక్షుడిగా అజీముద్దీన్, కార్యదర్శిగా ఎంఏ.జానిపాష, సహాధ్యక్షులుగా సుజాత, కోశాధికారిగా డి.నాగరాజు ఎన్నికయ్యారు.

### నృసింహుడికి సంప్రదాయ పూజలు


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున ప్రధానాలలయాన్ని తెరచిన అర్చకులు.. శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ప్రధానాలయ మాడ వీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

### యాదాద్రి కొండపై మరో ప్రసాద విక్రయశాల

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదం కొనుగోలు సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం శివాలయానికి వెళ్లే దారిలో ప్రసాద విక్రయశాల ఉండగా, దీనికి అనుబంధంగా మరొక ప్రసాద విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కొండపై బస్టాండ్ వద్ద ఉన్న ధర్మదర్శనం క్యూలైన్ సమీపంలో నూతన ప్రసాద విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. సెలవు రోజుల్లో శ్రీస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో ప్రసాదం కోసం ప్రస్తుతం ఉన్న కౌంటర్ల వద్ద ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అదనంగా మరో విక్రయ కేంద్రం సిద్ధం చేశారు. దీన్ని రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

### పోచంపల్లి విద్యార్థినికి గోల్డ్‌మెడల్


గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లికి చెందిన రంగా నరేందర్ కుమార్తె రంగా మనీషా గోల్డ్ మెడల్ అందుకున్నారు. మనీషా వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు మెడికల్ సైన్సెస్‌లో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ నేపథ్యంలో గాంధీ మెడికల్ కాలేజీ తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మనీషాకు ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ అందజేశారు.

# చేరికల్లో హైడ్రామా!


దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న తిరునగరు భార్గవ్, ఆయన అనుచరులు

**కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నేతల చేరికపై వ్యతిరేకత**

- దీపాదాస్‌మున్షీ సమక్షంలో మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్, పలువురు కౌన్సిలర్ల చేరిక
- వ్యతిరేకించిన స్థానిక ఎమ్మెల్యే వర్గం, డీసీసీ అధ్యక్షుడు
- చేరిక చెల్లదంటూ ప్రకటించిన కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్
- ఇటీవల మునుగోడులో చలమల్ల కృష్ణారెడ్డి చేరికను ఒప్పుకోని రాజగోపాల్‌రెడ్డి వర్గం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, మిర్యాలగూడ : ప్రతిపక్ష పార్టీల నుంచి అధికార పార్టీల్లో చేరే నేతల విషయంలో హైడ్రామా నెలకొంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. కొత్తగా కాంగ్రెస్‌లో చేరే నేతల చేరికను ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేతలు వ్యతిరేకిస్తుండడంతో గందరగోళ పరిస్థితి నెలకొంటోంది. తాజాగా మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడాన్ని పాత నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. తమకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్‌లో ఎలా చేరుతారంటూ మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వర్గీయులతో పాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ అధిష్టానాన్ని ప్రశ్నించారు. దీంతో వారి చేరిక చెల్లదంటూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేఖ విడుదల చేశారు.

**ఇలా చేరిక.. అలా రద్దు**

మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మున్సిపల్ మాజీ చైర్మన్లు తిరునగరు నాగలక్ష్మి, మెరుగు రోశయ్యతోపాటు మరో 11 మంది కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు మొత్తం 28 మంది హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో రాగానే స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భార్గవ్, అతని అనుచరులు కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తుండగా కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీతోపాటు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇప్పుడు వారు పార్టీలో చేరడంతో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడిపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు తెలియకుండా వారు పార్టీలో ఎలా చేరారని ప్రశ్నించారు. ఇదే విషయంపై స్థానిక నేతలంతా సమావేశమై చర్చించారు. భార్గవ్ అతని అనుచరుల చేరికను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, తమ అనుమతి లేకుండా పార్టీలో ఎలా చేర్చుకుంటారని జిల్లా మంత్రులతోపాటు అధిష్టానాన్ని ఫోన్‌లో ప్రశ్నించారు. వారి చేరికను రద్దు చేయాలని పట్టుబట్టారు. దీంతో తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్.. భార్గవ్ అతని అనుచరుల చేరిక చెల్లదని, కాంగ్రెస్ జిల్లా నాయకులు, ఎమ్మెల్యేతో చర్చించాక తదుపరి నిర్ణయం తీసుకుంటామని లేఖ విడుదల చేశారు. ఇదే విషయాన్ని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ వ్యవహారం శనివారం హైడ్రామాగా మారింది. దీంతో ఉదయం చేరికకు మధ్యాహ్నం బ్రేక్ పడడంతో భార్గవ్ వర్గం ఎలా స్పందిస్తుందోనని పట్టణంలో చర్చ సాగుతోంది. అయితే, భార్గవ్ కాంగ్రెస్‌లో చేరికను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో కాంగ్రెస్ పాత నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**మునుగోడులోనూ ఇలాగే..**

ఇటీవల మునుగోడులోనూ ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత చలమల్ల కృష్ణారెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దాన్ని ఒప్పుకునేది లేదంటూ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వర్గం వ్యతిరేకించింది. దాంతో స్పందించిన భువనగిరి, నల్లగొండ డీసీసీ అధ్యక్షులు.. కృష్ణారెడ్డి చేరిక చెల్లదంటూ ప్రకటించారు. ఇతర నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. ముఖ్యంగా కోదాడలో ఇతర పార్టీల నుంచి చేరికలను కాంగ్రెస్ పాత నేతలు వ్యతిరేకిస్తున్నారు.

**చేరికలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు..**

అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలోకి దూకే నాయకుల్లారా ఖబడ్దార్ అంటూ శనివారం మిర్యాలగూడ పట్టణంలో ఫ్లెక్సీలు వెలిశాయి. పట్టణంలోని సాగర్ రోడ్డుతో పాటు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు కనిపించారు. ఆ ఫ్లెక్సీలకు కాంగ్రెస్ నాయకులు చెప్పులు దండలు వేసి నిరసన తెలిపారు.



భార్గవ్, అతని చేరికల పట్ల నిరసనగా మిర్యాలగూడ పట్టణంలో వెలసిన ఫ్లెక్సీలు

## కేసులు సత్వరం పరిష్కరించాలి


సమావేశ వేదికను ప్రారంభిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే


డిజిటలైజేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్

- త్వరలో కోర్టుల్లోని కేసులన్నీ డిజిటలైజేషన్ చేస్తాం
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

రామగిరి(నల్లగొండ) : అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. నల్లగొండలో అధునాతన సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన ఐదు కోర్టుల భవన సముదాయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో జిల్లాలోని అన్ని కోర్టులో కేసులన్నింటిని డిజిటలైజేషన్ చేసే అవకాశం ఉందన్నారు. నల్లగొండ బార్ అసోసియేషన్, బెంచ్ సమన్వయంతో పని చేసి ప్రజలకు సత్వర న్యాయం అందించాలని కోరారు. అనంతరం హైకోర్టు జడ్జిలు జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి నాగరాజు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు. అంతకుముందు కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి నూతన కోర్టు ఆవరణలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు జడ్జిలను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మేడ మోహన్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాసులు, న్యాయమూర్తులు, న్యాయాధికారులు, అడ్వకేట్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

**ఛాయా సోమేశ్వరాలయంలో పూజలు**

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ అలోక్ అధారే శనివారం పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. శివుడికి అభిషేకం చేశారు. ముందుగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చైరన్, కమిటీ సభ్యులు జ్ఞాపికతో సన్మానించారు.

## నామినేషన్ తిరస్కరణపై ఈసీకి ఫిర్యాదు


కలెక్టరేట్ ఎదుట లింగయ్య

నల్లగొండ : నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సోషల్ జస్టిస్ పార్టీ అభ్యర్థి సుంకరి లింగయ్య తన నామినేషన్ తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ శనివారం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రెండు పర్యాయాలు నామినేషన్ సమర్పించగా.. అఫిడవిట్‌లో కొన్ని కాలమ్స్ ఖాళీగా ఉన్నాయని నోటీసులు ఇవ్వగా.. తిరిగి సమర్పించానని.. అందులో కూడా సంతకం లేదంటూ నోటీసులు ఇవ్వడంతో సంతకం చేసి తిరిగి మూడోసారి ఇచ్చానని తెలిపారు. అయినా 26వ తేదీ నామినేషన్ల పరిశీలన సందర్భంగా తన నామినేషన్‌ను నిబంధనలకు అనుగుణంగా లేదని తిరస్కరించారని అన్నారు. అధికారులు తనకు ఎలాంటి సహకారం అందించకుండా ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల అధికారి, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆదివారం తెలంగాణ ఎన్నికల అధికారిని నేరుగా కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. నల్లగొండలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ పనితీరు సరిగా లేని ఆరోపించారు. హెల్ప్ డెస్క్ సహకారం లేకపోవడం వల్లే చాలా మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయన్నారు.

## బీజేపీతోనే దళితుల అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

నల్లగొండ టూటౌన్ : నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడిందని, బీజేపీతోనే దళితుల అభివృద్ధి సాధ్యమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. శనివారం నల్లగొండలో నిర్వహించిన ఎస్సీ మోర్చా విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పదేళ్ల కాలంలో దళితుల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో దళితులంతా బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. దళితులందరూ బీజేపీకి అండగా నిలిచి మూడోసారి నరేంద్ర మోదీని ప్రధాని చేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు నూకల నరసింహారెడ్డి, సంకల్ప సభ కన్వీనర్ చింత ముత్యాలరావు, పార్లమెంట్ ప్రభారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, పోతెపాక లింగస్వామి, పోతెపాక సాంబయ్య, ఎడ్ల రమేష్, పెరిక మునికుమార్, గడ్డం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీని ఓడించడమే సామాజిక శక్తుల లక్ష్యం


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

మిర్యాలగూడ అర్బన్ : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించడమే సామాజిక శక్తుల లక్ష్యమని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే మోదీ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల దృష్టిని మరల్చి తిరిగి అధికారంలోకి రావడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, గిరిజన సంఘం నాయకులు లింగానాయక్, సీపీఐ నాయకులు ఎండీ. సయ్యద్, జిల్లా యాదగిరి, రామలింగం, సైదులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు సీట్లలో గులాబీ జెండా ఎగురవేస్తాం


బీఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న రమావత్ రవీంద్రకుమార్, చిత్రంలో జగదీష్‌రెడ్డి

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు ఎంపీ సీట్లలో గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం నల్లగొండ వీటీ కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కోసం పార్టీని స్థాపించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అద్భుతంగా నిర్మించబడ్డ తెలంగాణను కాంగ్రెస్ నాలుగు నెలల కాలంలోనే కుప్పకూల్చిందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో భూములు బీడుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన ఉద్యమిస్తామన్నారు. ప్రజల గోసకు కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యాక రాష్ట్రంలో కనుమరుగయ్యేది కాంగ్రెస్సేనని విమర్శించారు. నిజ జీవితంలో నిజాలు పలకని కోమటిరెడ్డి బ్రదర్స్ గురించి మాట్లాడి తన నాలుకను మైల పర్చుకోనన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్.భాస్కర్ రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, తిప్పన విజయసింహారెడ్డి, నిరంజన్ వలి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, రామచంద్రనాయక్, చీర పంకజ్‌యాదవ్, బొర్రా సుధాకర్, మాలె శరణ్యారెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, కరీంపాషా, పిచ్చయ్య, ఫరుదుద్దీన్, రామ్మోహన్, శ్రీనివాస్, వెంకన్న, రాంరెడ్డి, లొడంగి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి ఓటు అడిగే అర్హత లేదు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నార్కట్‌పల్లి : పదేళ్లుగా అధికారంలో కొనసాగుతూ నిరుద్యోగులు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసగించిన బీజేపీకి ఓటు అడిగే అర్హత లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం నార్కట్‌పల్లి మండలంలోని ఔరవాణి, ఎల్లారెడ్డిగూడెం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజా సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడే జహంగీర్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, అరుణ జ్యోతి, కట్ట నర్సింహ, వేముల ఆనంద్, వెంకటేశ్వర్లు, శంకరయ్య, మహేష్, సరోజ, కల్లూరి యాదగిరి, చింతపల్లి బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

## పనులు సకాలంలో పూర్తిచేయాలి

దేవరకొండ : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకాలంలో పనులు పూర్తి చేయాలని డీఈఓ భిక్షపతి అధికారులకు సూచించారు. శనివారం దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, తూర్పుపల్లిలోని ప్రాథమిక పాఠశాల, దేవరకొండలోని బాలికల ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. వేసవి సెలవుల్లోనే గుర్తించిన సమస్యలకు సంబంధించి పనులను పూర్తి చేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో వంట గదులు, తరగతి గదుల మరమ్మతులు, మూత్రశాలలు వంటి పనులను పూర్తిచేసి రాబోయే విద్యా సంవత్సరంలోగా అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట దేవరకొండ ఎంఈఓ మాతృనాయక్ తదితరులు ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

## పోటీ నుంచి తప్పకుంటుందా..?

- భువనగిరిలో సీపీఎం కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందా..
- లోక్‌సభ నియోజకవర్గం వ్యాప్తంగా చర్చ
- సీపీఎం రాష్ట్ర నాయకులతో సీఎం రేవంత్ సంప్రదింపులు
- పొలిట్‌బ్యూరో నిర్ణయంపై సీపీఎం శ్రేణుల ఎదురుచూపు
- పోటీలో ఉంటామని అభ్యర్థి జహంగీర్ ప్రకటన

సాక్షి, యాదాద్రి : భువనగిరి లోక్‌సభ స్థానంలో సీపీఎం పోటీ నుంచి తప్పుకుని కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందన్న చర్చ జోరుగా సాగుతోంది. శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఎం రాష్ట్ర నేతలతో సంప్రదింపులు జరిపారు. సీఎంతో సమావేశం అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. మతోన్మాద బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు ఇస్తుందని ప్రకటించారు. భువనగిరిలో పోటీ నుంచి తప్పుకుని తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని సీపీఎంను సీఎం కోరారు. ఇప్పటికే సీపీఎం అభ్యర్థి జహంగీర్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా తమకు మద్దతు ఇవ్వాలని సీపీఎం నాయకులు గతంలోనే కాంగ్రెస్‌ను కోరారు. అయినప్పటికీ కాంగ్రెస్ తన అభ్యర్థిని ప్రకటించడమే కాకుండా నామినేషన్ కూడా వేశారు. ఈ క్రమంలో సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ రంగంలో ఉన్నారు. సుమారు లక్ష ఓట్లను సాధిస్తామని ధీమాగా ప్రచారం చేస్తున్నారు.

**పొలిట్ బ్యూరోకు భువనగిరి అంశం**

భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలా.. వద్దా.. అనే విషయాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ పొలిట్‌బ్యూరో దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. పొలిట్ బ్యూరో తీసుకునే నిర్ణయంపై సీపీఎం క్యాడర్‌తో పాటు భువనగిరి ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**పోటీలో ఉంటాం : ఎండీ జహంగీర్**

రాష్ట్రంలో ఒక్కచోటనే భువనగిరి లోక్‌సభ స్థానానికి సీపీఎం పోటీచేస్తుందని, ఈ స్థానంలో తమకు మద్దతు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకత్వం కాంగ్రెస్ పార్టీని గతంలో కోరిందని సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ చెప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్ నుంచి స్పష్టత రాకపోవడంతో భువనగిరి నియోజకవర్గంలో తమ పార్టీ పోటీలో ఉన్నదన్నారు. ఇప్పటికే క్షేత్ర స్థాయి ప్రచారం ముమ్మరంగా కొనసాగిస్తున్నామని, సీపీఎం శ్రేణులు, పార్టీ అభిమానులు అనవసర ప్రచారాలు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మల్కాజ్‌గిరి బరిలో మంచ్యాతండా వాసి



నామినేషన్ వేస్తున్న సపావట్ సుమన్‌నాయక్

**మఠంపల్లి:** మండలంలోని మంచ్యాతండాకు చెందిన గుర్రంబోడు భూపరిరక్షణ సమితి అధ్యక్షుడు సపావట్ సుమన్‌నాయక్ మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేస్తున్నాడు. శనివారం ఆయన మఠంపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ.. గుర్రంబోడు పునరావాస గిరిజనుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో దేశవ్యాప్తంగా తమ సమస్యను తెలియజేసేందుకే తాను మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి గుర్రంబోడు పునరావాస గిరిజనుల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

# కరువుకు బీఆర్ఎస్ పాలనే కారణం

- తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

**చౌటుప్పల్:** రాష్ట్రంలో ప్రస్తుత కరువు పరిస్థితులకు బీఆర్ఎస్ పదేళ్లపాటు సాగించిన అస్తవ్యస్త పాలనే ప్రధాన కారణమని తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. ఇందుకు బీఆర్ఎస్ నాయకులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ జనసమితి జిల్లా కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలకులు ఇష్టానుసారంగా అప్పులు చేసి రాష్ట్రాన్ని నిండా ముంచారని, లేకుంటే ఎంతో అభివృద్ధి జరిగేదన్నారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలను రూ.40వేల కోట్ల నుంచి రూ.1.47 లక్షల కోట్లకు పెంచారని ఆరోపించారు. రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తే నల్లగొండ జిల్లా సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులకు నిధులు ఇవ్వలేదన్నారు. కృష్ణా జలాల్లో వాటా కూడా సాధించలేకపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని, తమ వైఫల్యాలపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న అసమానతలు, పేదరికాన్ని నిర్మూలించాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ.20లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం.. కేవలం రూ.5లక్షల కోట్లు ఉన్న రైతు రుణాలను ఎందుకు మాఫీ చేయలేదని ప్రశ్నించారు. ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న ధరల ప్రభావంతో వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో రెండు శాతం ఉన్న నిరుద్యోగం ప్రస్తుతం 8 శాతానికి చేరిందన్నారు. అసమానతలు, పేదరికం పోవాలంటే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు దేశపాక శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, పల్లె వినయ్, మహిళా విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ సత్తూరి పుష్పలీల, నాయకులు మారం లక్ష్మారెడ్డి, రతన్‌రావు, సత్యనారాయణ, మందాల బాలకృష్ణారెడ్డి, కొత్త రవి, సీతారత్నం, మంజులారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్, షరీఫ్, గిరిబాబు, విజయలక్ష్మి, పాండు, బి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో తెలంగాణ జనసమితి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కోదండరాం

## ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా

- బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

**హాలియా:** తనను గెలిపిస్తే ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కార మార్గం చూపుతానని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి హాలియా పట్టణంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి మాజీ మంత్రి జానారెడ్డి చేసిందేమీ లేదన్నారు. నియోజకవర్గంలో పేదలకు సరైన వైద్యం అందక హైదరాబాద్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంకణాల నివేదితారెడ్డి, హాలియా మున్సిపాలిటీ ఇన్‌చార్జి మన్నెం రంజిత్‌యాదవ్, చెన్ను వెంకటనారాయణరెడ్డి, డాక్టర్ పానుగోతు రవికుమార్, చలమల్ల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

**దాచుకోవడం, దోచుకోవడమే కాంగ్రెస్ లక్ష్యం**

**పెద్దవూర:** అధికారంలోకి వస్తే దాచుకోవడం, దేశాన్ని దోచుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయినా ఇప్పటికి ఒక్క గ్యారంటీని నెరవేర్చలేదని ఆరోపించారు. దేశంలో అవినీతిరహిత పాలన కేవలం ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు వారసత్వ పార్టీలని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి వచ్చే నిధులన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని పేర్కొన్నారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఏరుకొండ నర్సింహ, దినేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



హాలియా: రోడ్ షోలో మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

## ఓటు హక్కు ఉన్న వారందరూ ఓటేయాలి

- జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ

**నల్లగొండ, రామగిరి(నల్లగొండ):** ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరు లోక్‌సభ ఎన్నికల్లో ఓటేయాలని నల్లగొండ జిల్లా లోకసభ ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు. శనివారం ఆయన నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కేశరాజుపల్లి, తిప్పర్తి, మాడుగులపల్లి, కుక్కడం, వేములపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరికి ఓటరు స్లిప్పులు పంపిణీ చేసి పోలింగ్ తేదీని ఓటర్లకు తెలియజేయాలని సూచించారు.



తిప్పర్తిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ

## సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

- అనుచిత పోస్టింగ్‌లు పెడితే చర్యలు
- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

**సూర్యాపేట:** లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పౌరులు బాధ్యతగా నడుచుకోవాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియా మానిటరింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఎవరైనా ఇతర వ్యక్తులను, రాజకీయ పార్టీలను ఉద్దేశించి సోషల్ మీడియాలో( వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్) అనుచితమైన వ్యాఖ్యలు, పోస్టింగ్‌లు పెడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ డివైజ్‌లు సీజ్ చేస్తామని తెలిపారు.



రాహుల్ హెగ్డే, ఎస్పీ

## స్ట్రాంగ్‌రూంలకు పటిష్ట భద్రత

**భానుపురి (సూర్యాపేట):** ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం ఈవీఎం స్ట్రాంగ్‌రూంలకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు, జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్రపర్చిన ఈవీఎం స్ట్రాంగ్‌రూంలను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూంల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఫైర్ అలారమ్స్ భద్రతపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, మార్కెటింగ్ డీఎం శర్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్ట్రాంగ్‌రూంల భద్రతపై చర్చిస్తున్న కలెక్టర్ వెంకటరావు, ఎస్పీ రాహుల్ హెగ్డే

## గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

- 24కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

**కేతేపల్లి:** ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి రవాణా చేస్తున్న ముఠాను శనివారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.6లక్షల విలువైన 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వెల్లడించారు. 65 నంబరు జాతీయ రహదారిపై కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద శనివారం ఉదయం కేతేపల్లి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో తనిఖీ చేసే ప్రాంతానికి ముందు కొద్దిదూరంలో సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓలారీ నుంచి ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు బ్యాగులతో అనుమానాస్పదంగా దిగి పక్కనే చెట్ల పొదల్లోకి వెళ్లడాన్ని పోలీసులు గమనించారు. వారిని వెంబడించి తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న ఆరు బ్యాగుల్లో గంజాయి లభ్యమైంది. విచారణలో మహారాష్ట్రలోని ముంబయికి చెందిన ముస్కాన్ అఫ్తాద్ అన్సారీ, షెహనాజ్ ఇలియాజ్‌ఖాన్, ఒడిశా రాష్ట్రంలోని గణపతి జిల్లాకు చెందిన చితునాయక్‌లు ఒక ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి ముంబాయికి కూలి తీసుకుని గంజాయిని సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఈక్రమంలో ఒడిశాలోని బారంపూర్‌కు చెందిన మనోజ్ నుంచి ఆరు బ్యాగుల్లో నింపిన గంజాయిని తీసుకుని ముంబయికి చెందిన మైఖేల్ అనే వ్యక్తికి సరఫరా చేసేందుకు శుక్రవారం రాత్రి బయలుదేరారు. ఇందుకు గాను ఒకొక్కరికి రూ.6వేలు కూలీ విధంగా ఒప్పందం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6 లక్షల విలువైన 24 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని పేర్కొన్నారు. చితునాయక్ గతంలో గంజాయి రవాణా చేస్తూ ముంబయి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లాడు. గంజాయి సరఫరా చేసిన బరంపూర్‌కు చెందిన మనోజ్, మహారాష్ట్రలో కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్న మైఖేల్ పరారీలో ఉన్నారు. సమావేశంలో శాలిగౌరారం సీఐ శ్రీనివాస్‌రెడ్డి, కేతేపల్లి ఎస్ఐ శివతేజ, సిబ్బంది మహేష్, సురేష్, అజిత్ పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి

### అదృశ్యమైన వ్యక్తి మృతి

**చిట్యాల:** ఇటీవల అదృశ్యమైన ఓ వ్యక్తి డ్రెయినేజీలో శవమై తేలాడు. ఎస్ఐ సైదాబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిట్యాల పట్టణానికి చెందిన సీపీఐ నాయకుడు మేకల భిక్షం(58) ఈ నెల 21న అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. శనివారం పట్టణంలోని వేణుగోపాల స్వామి కాలనీలోని ఓపెన్ డ్రెయినేజీలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని అతను మేకల భిక్షంగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా.. భిక్షం అదృశ్యమైన రోజు సాయంత్రం చిట్యాలలో భారీ వర్షం పడటంతో బయట ఉన్న ఆయన తిరిగి ఇంటికి రాలేదు. ఇంటికి కిలోమీటరున్నర దూరంలో ఉన్న ఓపెన్ డ్రెయినేజీలో పడి ఎలా మృతి చెందాడనే విషయం ప్రశ్నగా మారింది. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.



భిక్షం (ఫైల్)

# వీడని వడ్డె ఎల్లయ్య కేసు మిస్టరీ

- కిడ్నాప్ జరిగి పది రోజులు కావస్తున్నా నేటికీ తెలియని ఆచూకీ

**సూర్యాపేట:** మండలంలోని యల్కారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వడ్డె ఎల్లయ్య కిడ్నాప్ కేసు మిస్టరీ నేటికీ వీడలేదు. భార్యాభర్తల పంచాయితీలో పెద్దమనిషిగా ఈనెల 18న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేటకు వెళ్లిన ఎల్లయ్య ఆచూకీని పోలీసులు గుర్తించలేకపోయారు. ఆయన కనిపించకుండా పోయిన మరుసటి రోజునే జగ్గయ్యపేట పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగి పదిరోజులు కావస్తున్నా ఇప్పటికీ పోలీసులు మౌనం వీడటం లేదు. ఈ కేసు మిస్టరీని ఛేదించేందుకు జగ్గయ్యపేటలో మూడు, సూర్యాపేటలో రెండు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

**మాచిరెడ్డిపల్లి వాసిపై అనుమానం**

నాగారం మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి, ఎల్లయ్యకు మధ్య భూ వివాదం నడుస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. అతనే ఎల్లయ్యను కిడ్నాప్ లేదా హత్య చేయించి ఉంటాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. అతను కనిపించకుండా పోయిన మరుసటి రోజు నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారి కనిపించకుండా ఉండటం వారి అనుమానాలకు బలం చేకూరుస్తోంది. సూర్యాపేట నుంచి ఎల్లయ్యను పంచాయితీ పేరుతో పథకం ప్రకారం అపర్ణ, శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులు జగ్గయ్యపేటకు తీసుకెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. వీరిద్దరి ఆచూకీని సైతం పోలీసులు నేటికీ గుర్తించలేకపోయారు. వీరు వినియోగించిన సెల్‌ఫోన్‌ల ఆధారంగా వారిని గుర్తించే పనిలో ఉన్నారు. మరోవైపు సూర్యాపేట నుంచి ఎల్లయ్య తీసుకెళ్లిన కారును ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత చిల్లకల్లు టోల్‌గేట్ వద్ద గుర్తించినట్లు తెలిసింది.

**పోలీసుల అదుపులో అనుమానితులు**

ఎల్లయ్య కనిపించకుండా పోవడంపై కుటుంబ సభ్యులు పలువురిపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మాచిరెడ్డిపల్లికి చెందిన రియల్ వ్యాపారితో పాటు మరో ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.



వడ్డె ఎల్లయ్య

### 20 కేసుల్లో నిందితుడు

ఎల్లయ్య మొత్తం 20 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇందులో ఐదు హత్య, మరో ఐదు హత్యాయత్నానికి సంబంధించిన కేసులు ఉన్నాయి. రెండేళ్ల క్రితం జరిగిన యల్కారం మాజీ సర్పంచ్ ఒంటెద్దు వెంకన్న హత్య కేసులోనూ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఈ హత్య తర్వాత సూర్యాపేట రూరల్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేయడంతో ఎనిమిది నెలలు జైలు జీవితం కూడా గడిపాడు.

## మనస్తాపంతో ఆత్మహత్య

**చౌటుప్పల్:** మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం ఆరెగూడేనికి చెందిన ఉయ్యాల శ్రీను సిమెంట్ బ్రిక్స్, రింగులు తయారు చేస్తుంటాడు. అతడి భార్య పున్నమ్మ(42) కూలీ పనులు చేస్తుంది. శుక్రవారం కూలీ పనికి వెళ్లిన పున్నమ్మ సాయంత్రం ఇంటికి చేరుకుంది. అదే సమయంలో శ్రీను ఇసుకను జల్లెడ పడుతున్నాడు. పొద్దంతా పనిచేసి అలసిపోయి మళ్లీ పనిచేయడం ఎందుకని భర్తకు చెప్పింది. ఇంట్లోకి రమ్మని చెప్పగా.. భర్త వినకుండా పనిచేస్తూనే ఉన్నాడు. దీంతో ఆమె మనస్తాపానికి గురై ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన భర్త ఆమెను కాపాడేందుకు ప్రయత్నించగా.. అతడి రెండు చేతులకు మంటలు అంటుకున్నాయి. అప్పటికే తీవ్రంగా గాయపడిన పున్నమ్మ మృతిచెందింది. శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**ఆర్థిక సమస్యలతో..**

**చండూరు:** ఆర్థిక సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. నాంపల్లి మండలం గానుగపల్లికి చెందిన మంగమ్మకు (37) దోనిపాములకు చెందిన చాపల నరసింహతో 17 ఏళ్ల క్రితం పెళ్లైంది. వారు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోవడంతో మనస్తాపానికి గురైన మంగమ్మ శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. శనివారం మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

## కోదాడ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు హైకోర్టు షాక్

- నకిలీ పత్రాలతో నాలా కన్వర్షన్ అనుమతి పొందారని హైకోర్టులో పిటిషన్ దాఖలు
- నాలుగు వారాల్లో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశాలు

**కోదాడ:** కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులు ఇతరుల భూమిని తమదిగా చూపడంతోపాటు, నకిలీ పత్రాలతో నాలా కన్వర్షన్ అనుమతులు పొందారని కోదాడకు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకుడు బట్టు శ్రీహరి హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై కోర్టు స్పందించింది. ఫిర్యాదుదారుడు చేసిన ఆరోపణలపై ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి నాలుగు వారాల్లోగా తగిన చర్యలు తీసుకోవాలని, అంత వరకు కళాశాలకు ఎటువంటి అనుమతులు పొడగించవద్దని ఆదేశాలు ఇచ్చింది. కోదాడలోని కిట్స్ ఇంజనీరింగ్ ఆర్డీఓ సంతకాన్ని ఫోర్జరీ చేసి నాలా కన్వర్షన్ సర్టిఫికెట్ పొందిందని దీనిపై చర్యలు తీసుకోవాలని ఓయూ జేఏసీ నేత జేఎన్‌టీయూకి ఫిర్యాదు చేశాడు. దీనిపై యూనివర్సిటీ నిపుణుల కమిటీ ఏర్పాటు చేయడంతో వారు నివేదిక ఇచ్చారు. ఈ నివేదికలో కళాశాల తమదని చెపుతున్న యాజమాన్యపు హక్కుల పత్రాలతో పాటు, దీనికి ఆర్డీఓ ఇచ్చిన నాలా సర్టిఫికెట్‌లను సమర్పించడంలో విఫలమైందని పేర్కొన్నారు. సమాచార హక్కుచట్టం ద్వారా దీనిని సేకరించిన బట్టు శ్రీహరి కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐసీటీఈ, జేఎన్‌టీయూలకు ఫిబ్రవరి 17న ఫిర్యాదు చేశాడు. వారు స్పందించకపోవడంతో మార్చి 18న మరోసారి ఫిర్యాదు చేశాడు. అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో బట్టు శ్రీహరి రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని ఈనెల 23న ఉత్తర్వులు జారీ చేశారు.

## లోన్ యాప్ వేధింపులు తట్టుకోలేక..

- ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

**మర్రిగూడ:** ఆన్‌లైన్ యాప్ ద్వారా తీసుకున్న అప్పు కట్టాలని నిర్వాహకులు ఒత్తిడి తేవడంతో.. అప్పు తీర్చే మార్గం లేక ఓ యువకుడు మానసికవేదనకు లోనై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి మర్రిగూడ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రంగారెడ్డి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన కొడిచర్ల శేఖర్ నాయీబ్రాహ్మణ వృత్తి నిర్వహిస్తున్నాడు. తన ఇద్దరు కుమారులు తనకు చేదోడువాదోడుగా పని చేసేవారు. పెద్దకుమారుడు కొడిచర్ల అభిరామ్(21) మాల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇతను ప్రైవేట్ యాప్ ద్వారా కొంత నగదును లోన్ రూపంలో తీసుకున్నాడు. ఈ నగదును సమయానికి కట్టకపోవడంతో యాప్ నిర్వాహకులు అభిరామ్‌పై ఒత్తిడి తెచ్చారు. అప్పు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురై ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఫంక్షన్‌కు వెళ్లగా.. అతడి తమ్ముడు షాపు మూసివేసి ఇంటికి వచ్చి చూసేసరికి అభిరామ్ ఉరి వేసుకుని కనిపించడంతో సమీపంలోని వారి సాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.



అభిరామ్ (ఫైల్)

## రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు

**కేతేపల్లి:** మండలంలోని చీకటిగూడెం వద్ద 65 నంబరు జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని రాజోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో శనివారం రాజోలు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈక్రమంలో చీకటిగూడెం గ్రామానికి చేరుకోగానే గేదె అడ్డురావటంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. ఇదే సమయంలో బస్సు వెనకాలే వస్తున్న అదే డిపోకు చెందిన మరో ఆర్టీసీ బస్సు ఈ బస్సును ఢీకొట్టింది. ఈప్రమాదంలో రెండు బస్సుల్లోని ఎనిమిది మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి గమ్యస్థానాలకు పంపించి వేశారు.



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు, ఘటనా స్థలంలో క్షతగాత్రులు

## బైక్ అదుపుతప్పి మహిళ మృతి

**హుజూర్‌నగర్:** పట్టణ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. మఠంపల్లి మండలం తుమ్మలతండాకు చెందిన గుగులోతు కళావతి(41) హుజూర్‌నగర్‌కు వస్తున్న రామకృష్ణను లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కింది. ఎర్రగట్టుకు రాగానే బైక్‌కు కుక్క అడ్డం వచ్చింది. తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. కళావతికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ రామకృష్ణను హుజూర్‌నగర్‌కు తరలించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



కళావతి(ఫైల్)

- ప్రకృతి ప్రేమికుడా.. భళా!



రోడ్డు వెంట నాటిన పూల మొక్కలకు మండు వేసవిలో సైతం నీరు పోస్తూ తన ఉదారతను చాటుకుంటున్నాడు ఓ ప్రకృతి ప్రేమికుడు. అర్వపల్లిలోని నకిరేకల్–తానంచర్ల హైవే మధ్య గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పూల మొక్కలు నాటారు. స్థానిక వ్యాపారి పోలోజు మదనాచారి ఇల్లు ఈ రోడ్డు వెంటే ఉండడంతో ఆ మొక్కలు ఎండిపోకుండా రోజూ నీళ్లు పోస్తూ సంరక్షిస్తున్నారు.

– అర్వపల్లి

## ఆదర్శ వివాహానికి సిద్ధమైన యువకుడు

- పుట్టుకతో కంటిచూపు కోల్పోయిన యువతి
- వివాహం చేసుకునేందుకు అంగీకరించిన యువకుడు

**అనంతగిరి:** ఆదర్శ వివాహానికి ఓ యువకుడు సిద్ధమయ్యాడు. పుట్టుకతో కంటి చూపు కోల్పోయిన యువతిని పెళ్లి చేసుకునేందుకు అంగీకరించాడు. అనంతగిరి మండల పరిధిలోని పాలారం గ్రామానికి చెందిన మల్లం యశోధకు అనూష, నాగమణి కుమార్తెలు. వీరు పుట్టుకతోనే అంధులు, భర్త మల్లయ్య చనిపోవడంతో కుమార్తెలను బ్రెయిలీ లిపీలో డిగ్రీ వరకు చదివించింది. పెద్ద కుమార్తె అనూష అనారోగ్యం బారిన పడింది. దీంతో రెండవ కుమార్తె నాగమణి వివాహం జరిపించాలని నిర్ణయించుకుంది. ఈక్రమంలో ఆ కుటుంబంతో దూరపు పరిచయం ఉన్న ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం, చిరుమర్రి గ్రామానికి చెందిన సోమగాని వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ కుమారుడు సందీప్.. నాగమణిని పెళ్లిచేసుకునేందుకు ముందుకు వచ్చాడు. శనివారం వధువు నాగమణి ఇంట్లో ప్రదానం కార్యక్రమం పూర్తయింది. ఆదివారం అత్తగారింటి వద్ద వివాహం జరగనుంది.



పెళ్లి చేసుకోనున్న జంట

## చెట్టును ఢీకొన్న కారు.. ఒకరు దుర్మరణం

- ఐదుగురికి స్వల్పగాయాలు

**సంస్థాన్ నారాయణపురం:** కారు అదుపు తప్పి చెట్టును కొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుడిమల్కాపురం–చిమిర్యాల గ్రామాల మధ్యలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన బోయపల్లి రాము(19), జీడిమెట్ల శివ, జీడిమెట్ల సాయి, బోయపల్లి రాకేష్, మేకల వేణు, దోటి శ్రీకాంత్ స్నేహితులు. వీరి స్నేహితుడు సోదరి వివాహానికి శుక్రవారం కారులో మునుగోడుకు వెళ్లి, అనంతరం అక్కడ నుంచి దేవరకొండ దగ్గరలోని వైజాగ్ కాలనీకి వెళ్లారు. శుక్రవారం రాత్రి తిరిగి తమ సొంత గ్రామమైన చీకటిమామిడికి వచ్చారు. ఏమైనా తినేందుకు చౌటుప్పల్‌కు బయల్దేరగా.. గుడిమల్కాపురం-చిమిర్యాల గ్రామాల మధ్యలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. డ్రైవింగ్ చేస్తున్న బోయపల్లి రాము అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. స్వల్ప గాయాలైన వారిని చికిత్స నిమిత్తం నల్లగొండకు పంపించారు. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాము చిన్న వయసులోనే అతడి తండ్రి మృతి చెందగా, తల్లి ఆరు నెలల క్రితం మృతి చెందింది. మృతుడికి తమ్ముడు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.